# అన్నదాతను ముంచిన వర్షం!

- తడిసి ముద్దయిన సోయాబీన్ దిగుబడులు
- గింజలు మొలకెత్తిన వైనం.. రూ. కోటి వరకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ విన్నపం


సోయాబీన్ గింజలకు మొలకలు వచ్చిన దృశ్యం


పెసరవాయిలో వర్షపునీటిలో తడిసిన సోయాబీన్ గింజలను చూపుతున్న రైతు


కల్లాల్లో ఆరబెట్టిన సోయాబీన్,మొక్కజొన్న గింజలు నీట మునిగిన దృశ్యం

గడివేముల: అకాల వర్షాలు అన్నదాతలను వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో గడివేముల మండల పరిధిలో సోయాబీన్ పంటను 5 వేల ఎకరాల్లో సాగుచేశారు. రైతులు పంట కోతలు పూర్తిచేసి దిగుబడులను కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. ఇక రెండు రోజుల్లో అమ్ముకుని సొమ్ము చేసుకుందామనుకున్నారు రైతులు. ఇంతలో వరుణుడు కన్నెర్ర చేశాడు. రెండు రోజుల నుంచి కురిసిన వర్షానికి పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో 200 ఎకరాల సోయాబీన్ దిగుడులు నీట మునిగాయి. గింజలు తడిసిముద్ద అయ్యాయి. అక్కడక్కడ మొక్కజొన్న దిడుబడులు సైతం తడిసిపోయాయి. అన్నదాతకు కన్నీళ్లే మిగిలాయి. అకాల వర్షంతో దాదాపు రూ. కోటి వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. పెసవాయి గ్రామానికి చెందిన దాదాపు 35 మంది రైతులకు చెందిన సోయాబీన్ గింజలు దెబ్బతిని మొలకలు వచ్చాయి. శ్రీనివాసులు, మధు సూదన్‌రెడ్డి, దమోదర్,ఏసురత్నం, పుల్లక్క, నరసింహా అచారి, శీలక్క, సామన్న,చిన్న పుల్లన్న, నరసింహుడు, చిన్న వెంకటేశ్వర్లు, కైప హరినాథరెడ్డి, మురళీకృష్ణ, తిరుపాలు, వాసుదేవరెడ్డి, వెంకటరమణ సురేంద్రనాథరెడ్డి తదితర రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదేవిధంగా కరిమద్దెల గ్రామానికి చెందిన రామకృష్ణ, తమ్మరాజుపల్లె నాగేంద్ర, పుల్లయ్య, నడిపి మౌలాలి, శివారెడ్డి, శేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చిన్న మౌలాలి తదితర రైతులు సాగు చేసిన సోయాబీన్, మొక్కజొన్న దిగుబడులు నీటి పాలయ్యాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు బాధిత రైతులు.

### రూ.6 లక్షల మేర నష్టం



నాసొంత పొలం 14 ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశా. ఈ ఏడాది పంట దిగుబడులు బాగానే వచ్చాయని సంతోష పడ్డా. ఎకరాలకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావడంతో కల్లంలో ఆరబెట్టుకున్నా. రెండు రోజుల్లో విక్రయించాల్సి ఉంది. శనివారం తెల్లవారుజామున వర్షం భారీగా కురిసింది. కల్లంలోకి వర్షపు నీరు రావడంతో సోయాబీన్ గింజలు మునిగిపోయా యి. గింజలపై కప్పిన పట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తుంది.రెండో రోజుకు గింజలకు మొలకలు వచ్చాయి. దాదాపు రూ.6 లక్షల దాకా నష్టం జరిగినట్లే

– వాసుదేవ రెడ్డి,పెసరవాయి

### ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న నాలుగు ఎకరాలలో సోయాబీన్ సాగు చేశా. రూ.50 వేల దాకా పెట్టుబడి అయ్యింది. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.4,300 వరకు ధర ఉంది. ఆర్థిక కష్టాలు తీరుతాయని ఆశించా. అకాల వర్షం ముంచింది. దాదాపు రూ.1.30 లక్షల వరకు నష్టం జరిగింది. నీటిలో సోయాబీన్ గింజలు మునగడంతో ఉబ్బి మొలకలు వచ్చే పరిస్థితి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆదుకోవాలి.

– తిరుపాలు, సోయాబీన్ రైతు,బూజునూరు

### గింజలకు మొలకలు వచ్చాయి



నాకున్న ఏడు ఎకరాలలో సోయాబీన్ సాగు చేశాను. కేసీ కెనాల్ కింద నీరు రావడంతో దిగుబడి బాగా వచ్చింది. ధర కూడా అనుకూలంగా ఉంది. రేపోమాపో విక్రయించాలని భావించా. అంతలోనే వరుణుడు నా ఆశలపై నీళ్లు చల్లాడు. కల్లంలో ఆరబోసిన సోయాబీన్ గింజలు తడిసిపోయాయి. తడిసిన సోయాబీన్ గింజల వెంట మొలకల రావడంతో కొనడానికి వ్యాపారస్థులు ముందుకు రావడం లేదు. అకాల వర్షం కారణంగా దాదాపు రూ. 3 లక్షల వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోని నష్టపరిహారం అందించాలి.

– చిందుకూరు వెంకటరమణ,పెసరవాయి

### తెల్లవారితే తూకం వేసేవాళ్లం



నాకున్న నాలుగు ఎకరాలతోపాటు మరోరెండెకరాలు కౌలుకు తీసుకుని సోయాబీన్ సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడి అయ్యింది. పంట దిగుబడులు బాగా వచ్చాయి. తెల్లవారితే తూకం వేయడానికి వ్యాపార్తులు వస్తారు. అంతలోనే భారీ వర్షం కురవడంతో కల్లంలో ఆరబెట్టిన సోయాబీన్ గింజలు తడిసి పోయాయి. సభ్యులతో కలిసి నీటిలోని గింజలను ఎత్తుకున్నాం. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ గింజలు కొంటారో లేదో చూడాలి. దాదాపు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లే. ప్రభుత్వం నష్టపోయిన సోయాబిన్ రైతులను ఆదుకోవాలి.

– నడిపి మౌలాలి, రైతు, కరిమద్దెల

## క్లుప్తంగా

### ఆర్థిక సాయం


కుటుంబ సభ్యులకు రూ. 2లక్షలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో సిరివెళ్ల మండలానికి చెందిన ఆటో డ్రైవర్‌గా జాకీర్ ఉసేన్ కుమారుడు మహ్మద్ రిజ్వాన్ ఫైనల్ సీఎస్‌ఈ చదువుతున్నాడు. ఈ విద్యార్థి కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు రెండు కిడ్నీలు పాడయ్యాయని, దాదాపు రూ. 20లక్షలు అవుతుందని చెప్పారు. దీంతో కళాశాల చెర్మన్ శాంతిరాముడు స్పందించారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల చెక్కును ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అందజేశారు.

### పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పిలునిచ్చారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

### ధ్వజ స్తంభం ఏర్పాటుకు విరాళం


నగదు అందజేస్తున్న దాతలు

కర్నూలు రూరల్ : మండల పరిధిలోని శరిన్ నగర్‌లో వెలసిన ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభం ఏర్పాటుకు దాతలు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగమదిలేట్టి, పూజారి హరికృష్ణ సమక్షంలో నగదు అందజేశారు.

### 'నరేష్‌ది ప్రభుత్వ హత్యే'

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీతో అబ్కారీ శాఖలో సేల్స్‌మెన్ ఉద్యోగం పోతుందన్న బెంగతో జూపాడుబంగ్లాకు చెందిన నరేష్ రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణా లు కోల్పోయారని, అతని కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. అక్టోబర్ 1వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అబ్కారీ శాఖ సేల్స్‌మెన్ నరేష్ ఆది వారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీవైఎఫ్ఐ నాయకులు నరేష్ భౌతిక కాయాన్ని పరిశీలించారు. ఆయన మృతికి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. 15 రోజులక్రితం నరేష్ ను ఉద్యోగానికి రావొద్దని ఉన్నతాధికారులు చెప్పారన్నారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనతో అక్టోబర్ 1వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. నరేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరా లు. లేదంటే ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నాయకులు రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, శంకర్, అమర్, హరి, కిషన్ రెడ్డి శివ పాల్గొన్నారు.

### కోలుకోలేక న్యాయవాది మృతి

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాది కోలుకోలేక వ్యక్తి మృతి చెందాడు. డోన్‌కు చెందిన జూనియర్ న్యాయవాది బాలరాజు (25) ప్రతిరోజూ కర్నూలుకు వచ్చి విధులు ముగించుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన డోన్‌కు బైక్‌పై వెళ్తుండగా నగర శివారులోని వెంగన్నబావి సమీపంలో రోడ్డు దాటుతున్న విజయలక్ష్మి అనే మహిళను ఢీకొట్టి అతనూ కిందపడ్డాడు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బాలరాజు ఆదివారం మృతి చెందాడు.

### ఏసీబీ డీఎస్పీనంటూ మోసం

కర్నూలు(హాస్పిటల్): ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ చెప్పుకుని డబ్బులు ఖాతాలో వేయించుకుని మోసం చేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. కర్నూలు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన విజయభాస్కర్ విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఈ నెల 5వ తేదీన ఓ వ్యక్తి ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ మాటలు కలిపాడు. నీపై దాడి చేయకుండా ఉండాలంటే రూ.లక్ష తన ఖాతాకు పంపించాలని కోరాడు. ఆందోళన, కంగారులో అతనికి రూ.లక్షను విజయభాస్కర్ పంపించాడు. తర్వాత ఆరా తీయగా అది ఫేక్ కాల్ అని, నిందితుడిది బెంగళూరు అని నిర్ధారించుకున్నాడు. ఘటనపై ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

### ఆలయాభివృద్ధికి రూ. లక్ష విరాళం


ఈఓ రామకృష్ణకు చెక్కు అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం భక్తురాలు గురుప్రసాద్ భార్య వెంకటలక్ష్మీ రూ. లక్ష విరాళంగా చెక్కు అందజేశారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం దాతలకు ఈఓ రామకృష్ణ, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

### దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలి

కర్నూలు న్యూసిటీ: దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించి పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేసి తీపి కబురు అందించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.ఎస్.గణపతి, కాకి ప్రకాష్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా నిరూపించుకోవాలని కోరారు.

### సోయాబీన్ రైతులను ఆదుకుంటాం

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో ఆకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. ఆదివారం దెబ్బతిన్న దిగుబడులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంత నష్టం జరిగిందో రైతులను గుర్తించి జాబితాను తయారు చేయాలని ఏఓ హేమసుందర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోడుమూరులో భారీ వర్షం


జలమయమైన ప్యాలకుర్తిలోని మెయిన్ బజార్

కోడుమూరు రూరల్ : కోడుమూరులో ఆదివారం సాయంత్రం సుమారు అరగంటకుపైగా భారీ వర్షం కురిసింది. కోడుమూరుతో పాటు, మండలంలోని ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల్లోని వీధులు జలమయమయ్యాయి. ప్యాలకుర్తిలో మోకాటిలోతుకుపైగా నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రబీ సీజన్‌కు సాగుకు సిద్ధమవుతున్న రైతులకు వర్షం ఊరటనిచ్చింది.

## దెబ్బతిన్న ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్నాథం

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు గ్రామ సమీపాన స్థాపిస్తున్న స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న ఓపెన్ బ్లాస్టింగ్ మూలంగా దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గుట్టపాడు గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, మండల కార్యదర్శి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ బ్లాస్టింగ్ చేయడం వలన గృహాలు బీటలు బారుతున్నాయన్నారు. జగన్నాథం మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం వేల ఎకరాల భూమిని ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రైవేట్ పొలాలతో సమానంగా డీపట్టాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి జయన్న, నాయకులు ఈదుర్‌బాషా, ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

### కరాటేతో ధైర్యసాహసాలు

కర్నూలు (టౌన్): కరాటే సాధన వల్ల విద్యార్థినీ, విద్యార్థుల్లో ధైర్య సాహసాలు అలవడుతాయని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కరాటే క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్, క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు.

### తైక్వాండో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న కేఎంసీ పార్కులో తైక్వాండో క్రీడాకారులకు ఆదివారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తైక్వాండో శిక్షణకు ఉపయోగపడే ఈ కిట్ల ద్వారా మరింతగా సాధన చేసి మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవనం


ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతామూర్తులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత పఠనం, శ్రవణంతో జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నైతిక విలువలు నేర్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## హంద్రీలో పూడిక తొలగించాలి


మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): హంద్రీలో పేరుకుపోయిన పూడికను తీయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం 8వ వార్డు కమిటీ సమావేశాలను నరసింహులు అధ్యక్షతన వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద పడఖానా, దండిగేరి, ఖండేరి ప్రాంతాల సమీపంలో హంద్రీలో చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో నీరు నిలిచి దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఆయా ఏరియల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి బారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 8వ వార్డు కమిటీ కార్యదర్శిగా జె.రవికుమార్‌ను నియమించారు.


కోడుమూరు: లలిత త్రిపుర సుందరి దేవిగా శ్రీవల్లెలాంబదేవి


గూడూరు: శాకాంబరి అలంకరణలో అంబా భవానీ


కె.నాగలాపురంలో శ్రీలలిత త్రిపుర సుందరిగా అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


శ్రీలలితా దేవి అలంకరణలో పార్వతి అమ్మవారు

## త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


పాణ్యం : హోమం చేస్తున్న దృశ్యం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


సి.బెళగల్ : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవాని, శ్రీఅంబా భవాని అమ్మవార్లు గజలక్ష్మి, శ్రీలలిత త్రిపుర సుందరి అలంకర ణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో లలిత త్రిపుర సుందరిగా దర్శనమిచ్చి న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారికి పల్లకీ సేవాను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**గూడూరులో...**

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం గూడూరు మండలంలో అమ్మవార్లకు భక్తులు ప్ర త్యేక పూజలు చేశారు. గూడూరులోని అంబ భవానీ, కె.నాగలాపురం గ్రామంలో వెలసిన శ్రీసుంకులపరమేశ్వరీ అమ్మవార్లు శ్రీలలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**కాళికాదేవి అలంకరణలో అమ్మవారు**

కర్నూలు రూరల్ : కర్నూలు సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు కాళికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.


కాళికాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఈశ్వరాలయంలో ప్రతిష్టించిన పంచలోహ అమ్మవారు ఆదివారం లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి సుదర్శణాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోమటి వీధిలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవి, కొత్త బస్టాండ్‌లోని పార్వతీ ఆలయాలలోని అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పాణ్యం: మండలంలో దేవి నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులు దర్శమిచ్చారు. అలాగే శ్రీకాన్యక పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా కనువిందు చేశారు. హైందవశక్తి ఆధ్వర్యంలో కొలువుంచిన అమ్మవారు లలితాదేవిగా భక్తులు దర్శనమిచ్చారు.

గడివేముల: గడివేములలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వసంతలక్ష్మి గాయత్రీ దేవికి కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన్ గుప్తా, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, మల్లికార్జున, కార్యదర్శి సీవీ రమణయ్య, ఉప కార్యదర్శి సురేష్ కుమార్, సలహాదారులు బు జ్జయ్య, ఈపూరి పద్మనాభయ్య, శ్రీనివాసులు తదితరులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఓర్వకల్లు: దేవీశరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు శాస్త్రోక్తంగా అమ్మవార్లకు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో లోకకల్యాణార్థం హోమం చేశారు.


పాణ్యం: లలితాదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితాదేవిగా అమ్మవారు


గడివేముల: గాయత్రీదేవి అలంకరణలో వాసవి పరమేశ్వరి


ఓర్వకల్లు : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

### జిల్లా అథ్లెట్ల సత్తా


రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్లు

కర్నూలు (టౌన్): రాజమండ్రిలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో కర్నూలు అథ్లెట్లు ప్రతిభ చాటారు. అన్ని విభాగాల్లో సత్తా చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్ కార్యదర్శి సుబ్బారత్నాలు, శ్రీనివాసులు, కోచ్ కాశీరావు అభినందించారు. అథ్లెట్లు వెంకటరామిరెడ్డి, గోవింద్, మైత్రీ, సుకన్య, ప్రసన్నకుమారి బంగారు పతకాలు, గాబ్రియేలు, వెంకటేష్, దానమ్మ, వీరాకుమారి వెండి పతకాలు, మంజునాథ్, వెంకటేష్, సుకన్య కాంస్య పతకాలు సాధించారు.

### నేడు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అర్జీలను సమర్పించవచ్చని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.